సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 7 । మే । 2024



అప్పన్న సన్నిధిలో..

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికల్ వలవెన్ దర్శించుకున్నారు.



పుస్తకావిష్కరణ

విశాఖ: డాక్టర్ ప్రయాగ మురళీ మోహనకృష్ణ రచించిన నల్లటోపి, నీలికళ్లు, తెల్లకళ్లు పుస్తకాన్ని ఆచార్య మలయవాసిని ఆవిష్కరించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.9/28.5

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, భారీ వర్షాలు ఒకటి, రెండు చోట్ల పడవచ్చని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

టీడీపీ నేత నుంచి రూ.10 లక్షలు స్వాధీనం



నగదు స్వాధీనం చేసుకుని విచారిస్తున్న పోలీసులు

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలోని వేపగుంట మీనాక్షి కన్వెన్షన్ సమీపంలో టీడీపీ నేత దంతులూరి వెంకట దుర్గ ప్రశాంత్ వర్మ అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాని మోదీ సభకు జనాలను తరలించిన జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు వారికి పంపిణీ చేయడానికి నగదు తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వర్మ వద్ద లభించిన రూ.10 లక్షలకు ఎటువంటి ఆధారం లేకపోవడంతో డబ్బు సీజ్ చేసి పెందుర్తి పోలీసులకు అప్పగించారు.

హుబ్బళ్లి-నహర్‌లాగున్ మధ్య సమ్మర్ స్పెషల్స్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే హుబ్బళ్లి- నహర్లగున్-హుబ్బళ్లి మధ్య సమ్మర్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం కె.సందీప్ ప్రకటనలో తెలిపారు.

- హుబ్బళ్లి-నహర్లగున్(07387) సమ్మర్‌స్పెషల్ ప్రతీ బుధవారం హుబ్బళ్లిలో మధ్యాహ్నం 12.05గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 9.07గంటలకు బయల్దేరి శుక్రవారాల్లో రాత్రి11గంటలకు నహర్లగున్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 5వ తేదీ వరకు నడుస్తుంది.
- తిరుగు ప్రయాణంలో నహర్లగున్-హుబ్బళ్లి(07388) సమ్మర్ స్పెషల్ రైలు ప్రతీ శనివారం నహర్లగున్‌లో రాత్రి 11గంటలకు బయల్దేరి సోమవారం మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 3.10గంటలకు బయల్దేరి మంగళవారం ఉదయం 9గంటలకు హుబ్బళ్లి చేరుకుంటుది. ఈ స్పెషల్ రైలు జూన్ 8వ తేదీ వరకు నడుస్తుంది.

ముగిసిన తొలివిడత చందనం అరగదీత



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత సోమవారంతో ముగిసింది. ఈ నెల 10న చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు స్వామికి మూడు మణుగుల పచ్చి చందనం(120 కిలోలు) సమర్పించనున్నారు. ఇందుకోసం ఈ నెల 4వ తేదీ నుంచి అరగదీతను ప్రారంభించారు. తొలిరోజు శనివారం 36 కిలోలు, ఆదివారం 45 కిలోలు, సోమవారం 39 కిలోల చందనం అరగదీశారు. ఆలయ వైదికులు చందనాన్ని తూకం వేసి బాండాగారంలో భద్రపరిచారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉక్కు పోరాట కమిటీ నాయకుల ముందస్తు అరెస్ట్



కూర్మన్నపాలెం కూడలి వద్ద పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణను అరెస్టు చేస్తున్న పోలీసులు

కూర్మన్నపాలెం: ప్రజాగళం సభకు హాజరయ్యేందుకు ప్రధాని నరేంద్రమోదీ అనకాపల్లి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. దువ్వాడ, గాజువాక పోలీసులు సోమవారం కూర్మన్నపాలెంలోని దీక్ష శిబిరం వద్దకు చేరుకుని పోరాటం చేస్తున్న ఆదినారాయణతో సహా ముగ్గురు నాయకులను అరెస్ట్ చేసి పెందుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే ఎంతకైనా పోరాడతామని స్పష్టం చేశారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తున్నామనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్

- మొదటి రోజు 5,126 ఓట్లు పోలింగ్



నర్సీపట్నంలో ఓటేసేందుకు ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద బారులు తీరిన ఉద్యోగులు

తుమ్మపాల: జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు కేటగిరీల వారీగా మూడు రోజుల పాటు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. తొలిరోజు పీవోలు, ఏపీవోలు, మైక్రోఅబ్జర్వర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళవారం ఇతర పోలింగ్ సిబ్బంది, బుధవారం అత్యవసర సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తొలి రోజు జిల్లాలో 5,126 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గాల వారీగా చోడవరంలో 925 మంది, మాడుగులలో 735, అనకాపల్లిలో 914, యలమంచిలిలో 834, పాయకరావుపేటలో 722, నర్సీపట్నంలో 996 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులంతా క్యూలో నిలుచొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రక్రియ మంగళ, బుధవారాల్లో కూడా కొనసాగుతుంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు కూడా సాధారణ ఓటింగ్‌కు విచ్చేసినట్టే ఒక్కసారిగా ఉద్యోగులు రావడంతో రద్దీ ఏర్పడింది. ఎక్కువ మంది రావడంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉద్యోగులకు నిరీక్షణ తప్పలేదు.



చోడవరంలో ఓటు వేసేందుకు ఉద్యోగుల నిరీక్షణ

నేడు సీఎం జగన్ గాజువాక రాక

- సాయంత్రం 5 గంటలకు పాతగాజువాక జంక్షన్‌లో ఎన్నికల ప్రచార సభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



గాజువాక : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం గాజువాక రానున్నారు. సాయంత్రం 5 గంటలకు పాతగాజువాక జంక్షన్ 60 అడుగుల రోడ్‌లో జరగనున్న ప్రచార సభలో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఏర్పాట్లను సోమవారం పర్యవేక్షించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ తదితరులతో కలిసి 60 అడుగుల రోడ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గాజువాక నియోజకవర్గంలో ప్రచార సభలో పాల్గొంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఈ సభలో పాల్గొనాలని కోరారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఉరుకూటి చందు, పార్టీ నాయకులు ఉరుకూటి అప్పారావు, రొంగలి జగన్నాథం, రెడ్డి జగన్నాథం, గుడివాడ లతీష్, సిరట్ల శ్రీనివాస్, మొల్లి చిన్న, కొసిరెడ్డి గణేష్, షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం షెడ్యూల్ ఇలా..

బీచ్‌రోడ్డు : ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 12.20 గంటలకు రాజమండ్రి నుంచి విమానం ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టుకు 12.40 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్ ద్వారా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వెళ్తారు. అక్కడ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని తిరిగి 4.40 గంటలకు హెలికాప్టర్ ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో గాజువాక చేరుకొని.. సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు చేసిన ప్రచార సభలో పాల్గొంటారు. సభ అనంతరం 6 గంటలకు తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు రోడ్డు మార్గంలో చేరుకుంటారు. అక్కడ నుంచి విమానం ద్వారా గన్నవరం బయలుదేరి వెళ్తారు.

టీడీపీ హయాంలో ఉద్యోగులకు నిత్యం మానసిక ఒత్తిడే

- ఉద్యోగులు, పెన్షనర్లకు అన్ని విధాలుగా మేలుచేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి



చోడవరంలో విలేకరుల సమావేశంలో ఏపీ ఎన్జీవోస్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి

చోడవరం: ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుందని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారుడు ఎన్.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. చోడవరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంత మేలు జరిగిందో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు గుర్తించాలన్నారు. జన్మభూమి సభల్లో ఉద్యోగులను చంద్రబాబునాయుడు ఏ విధంగా మానసిక ఒత్తిళ్లకు గురిచేశారో, ఆ ఒత్తిళ్లు భరించలేక ఎంతమంది ఉద్యోగులు గుండెపోటుతో మృత్యువాత పడ్డారో అంతా గుర్తుచేసుకోవాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగులపై ఎటువంటి ఒత్తిళ్లు లేవన్నారు. పీఆర్‌సీ పూర్తిస్థాయి అమలు, సీపీఎస్ రద్దు అంశంపై కూడా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. పెన్షనర్లకు 3శాతం పెంపు అంశాన్ని కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన అంశాలన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గత టీడీపీ హయాంలో మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క అంశాన్నీ నెరవేర్చలేదన్నారు. చంద్రబాబు ఎప్పుడూ ఉద్యోగులను ప్రశాంతంగా విధులు నిర్వర్తించనీయలేదని, ఎప్పుడూ మానసిక ఒత్తిడికి గురిచేసేవారని చెప్పారు. ఉద్యోగులు, పెన్షనర్లు అంతా ఈ విషయాలపై సానుకూలంగా ఆలోచించి, వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని ఆయన కోరారు.

జెండా కూలీలమేనా..



8లో

ల్యాండ్ టైటిలింగ్ చట్టం కేంద్ర ప్రభుత్వానిదే...



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు



సమావేశానికి హాజరైన న్యాయవాదులు

- చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఆసక్తి లేదు
- ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున స్పందించలేం
- జిల్లా కేంద్రంగా నూతన కోర్టు భవనాల నిర్మాణానికి కృషి
- న్యాయవాదుల సంఘ సమావేశంలో ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు

అనకాపల్లి: ల్యాండ్ టైటిలింగ్ చట్టం కేంద్ర సర్కారు విధానాలకు అనుగుణంగా తీసుకువచ్చిందని, ప్రస్తుతం ఈ చట్టం కోర్టు పరిధిలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడే పరిస్థితి లేదని ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. అనకాపల్లి బార్ అసోసియేషన్‌లోని సీనియర్ న్యాయవాదులు సాయిరామ్ ప్రభాకర్, ఆడారి స్వామి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని, రాజకీయ లబ్ధి కోసం టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే జిల్లా కేంద్రంగా నూతన కోర్టు భవన నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. న్యాయవాదులు హౌసింగ్ స్థలాలు కావాలని కోరారని, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి న్యాయవాదుల కాలనీ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జూనియర్ న్యాయవాదులు చదువుకునేందుకు అధికారం చేపట్టిన వెంటనే తన సొంత నిధులతో లైబ్రేరీ ఏర్పాటు చేస్తానన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో న్యాయవాదులు తమకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ తాను అమెరికాలో లా పూర్తిచేయడం జరిగిందని, త్వరలో ఇండియన్ లా చదువుతానని ఆయన పేర్కొన్నారు. కోర్టు నూతన భవన నిర్మాణం అంశం ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ పార్లమెంటులో కొత్తగా చట్టాలను తయారు చేసేందుకు 12 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారని, ఆ కమిటీలో తన పేరును పొందుపర్చడం ఆనందాన్ని కలిగించిందన్నారు. కోర్టుల్లో ఎక్కువ రోజులు కేసులు ఉండకుండా త్వరితగతిన పరిష్కార మార్గానికి కేంద్రం కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. జూనియర్ న్యాయవాదులకు ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వం లా నేస్తం రూ.5 వేలు ఇస్తున్నట్టు ఆమె తెలిపారు. శంకరం గ్రామంలో రూ.కోటీ 50లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం జరుగుతుందని, భవనాన్ని లాయర్స్ కోసం కేటాయిస్తామన్నారు. సీనియర్ లాయర్ ఆడారి స్వామి మాట్లాడుతూ ప్రస్తుతం కోర్టు ప్రైవేట్ భవనంలో ఉందని, నెలకు రూ.2.75 లక్షలు ప్రభుత్వం అద్దె చెల్లిసుందని అన్నారు. పాత కోర్టు భవనంలో సుమారుగా రూ. 25 కోట్లతో 5 అంతస్తుల భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. మరో లాయర్ సాయిరామ్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి డి.నర్సింగరావు మాట్లాడారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి సూరా శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీరియల్ కిల్లర్



నిందితుడు ఉపేంద్ర (ఫైల్)

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశ ఉన్న యువకులే అతని టార్గెట్.. వారితో స్నేహం చేస్తాడు. కొంత మొత్తం వెచ్చిస్తే దానికి రెండింతలు సంపాదించవచ్చని నమ్మబలుకుతాడు. తీరా నగదు తీసుకువచ్చిన వారిని అదును చూసి అంతమొందిస్తాడు. సాక్ష్యం లేకుండా జాగ్రత్త పడతాడు. ఒక్కడే ఈ కిరాతకానికి పాల్పడతాడు. రెండేళ్ల క్రితమే రెండు హత్య కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరుగుతున్న ఆ కిల్లర్ మరో రెండు హత్యలు చేసి పోలీసులను సైతం తప్పుదోవ పట్టించి దర్జాగా తిరుగుతున్నాడు. చివరకు గత నెల 29న మరో హత్య చేసి దొరికిపోయాడు. దీంతో లచ్చన్నపాలెం వలంటీర్, మునగపాకలో ఒక యువకుడి హత్యలు వెలుగులోకి వచ్చాయి. దీనికి సంబంధించి నర్సీపట్నం రూరల్ సీఐ హరి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు..

- డబ్బు కోసం సునాయాసంగా ప్రాణాలు తీస్తున్న కిరాతకుడు
- ఇంటర్ నుంచే హత్యలు మొదలు.. ఇంతవరకు ఐదుగురు హతం
- రెండు కేసుల్లో జైలుకు.. బెయిల్‌పై వచ్చి మరో మూడు హత్యలు
- నిందితుడు ఉపేంద్రను అరెస్టు చేసిన పోలీసులు





హత్యకు గురైన వలంటీర్ హరి (ఫైల్), శివశంకర్ (ఫైల్)



హత్యల వివరాలను వెల్లడిస్తున్న సీఐ హరి, ఎస్ఐ రామకృష్ణారావు

మాకవరపాలెం, మునగపాక: చూసేందుకు స్వచ్ఛంగా.. చలాకీగా కనిపించే ఆ యువకుడి పేరు పెచ్చెట్టి ఉపేంద్ర (24). వి.మాడుగుల మండలం జంపెన గ్రామానికి చెందిన ఇతడు అచ్యుతాపురం ప్రాంతంలో ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇదే కంపెనీలో పనిచేస్తున్న మండలంలోని జడ్.గంగవరం గ్రామానికి చెందిన రుత్తల శివశంకర్(25)తో పరిచయం చేసుకున్నాడు. తక్కువ నగదుతో అధిక మొత్తంలో సంపాదించొచ్చని శివశంకర్‌ను నమ్మించాడు. ఫోన్ సైతం వాడకుండా, తను ఇతరులకు ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. గత నెల 29న జడ్.గంగవరం గ్రామ శివారుకు రావాలని, లిక్విడ్ గంజాయితో అక్కడకు కొందరు వస్తున్నారని, రూ.2 లక్షల నగదుతో రావాలని శివశంకర్‌కు చెప్పాడు. ఆశతో అక్కడకు వెళ్లిన శివశంకర్‌ను అదను చూసి కర్రతో తలపై కొట్టి హత్య చేసి నగదుతో పరారయ్యాడు. ఈ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు మూడు టీంలుగా ఏర్పడి విచారణ చేపట్టారు.

ఈ విచారణలో మృతుడితో ఉపేంద్ర సన్నిహితంగా ఉన్నట్టు గుర్తించిన పోలీసులు మండల కేంద్రంలోని బస్టాండు వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలో శివశంకర్‌తోపాటు జనవరి 31 రాత్రి హత్యకు గురైన లచ్చన్నపాలెం వలంటీర్ నడింపల్లి హరిని కూడా పింఛన్లు పంపిణీకి తీసుకువచ్చిన రూ. లక్ష నగదు కోసం ఉపేంద్రే హత్య చేసినట్టు బయటపడింది. దీంతో మూడు నెలల అనంతరం హరి హత్య కేసులో మిస్టరీ వీడింది.

ఐదుగురిని హత్య చేసిన ఉపేంద్ర

వ్యసనాలకు అలవాటుపడ్డ ఉపేంద్ర గంజాయి వ్యాపారం ఆశ చూపి నగదు కోసం ఇప్పటికి ఐదుగురిని హత్య చేసినట్టు సీఐ హరి వెల్లడించారు. ఎవరిని హత్య చేసినా కర్రతో తల వెనుక భాగంలో కొట్టి కొట్టి హతమారుస్తాడన్నారు. వలంటీర్ హరిని హత్య చేసి రూ.లక్ష, శివశంకర్‌ను హతమార్చి రూ.2 లక్షలు తీసుకున్నట్టు చెప్పారు. ఇంటర్ చదువుతున్న సమయంలో 2021లో వి.మాడుగుల మండలంలో రెండు హత్యలు చేసి జైలుకు వెళ్లిన ఉపేంద్ర బెయిల్‌పై బయటకు వచ్చాడు. గ్రామస్తులు అతనిని ఇంటి నుంచి గెంటేశారు. దీంతో సమీపంలోని అనకాపల్లిలో అద్దె ఇంటిలో ఉండేవాడు. ఇక్కడ ఉంటూ అచ్యుతాపురం మండల పరిధిలోని లారస్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. మునగపాక మండలం నాగులాపల్లికి చెందిన యల్లపు మహలక్ష్మినాయుడితో పరిచయం పెంచుకున్నాడు. రూ.లక్షా 5 వేలు తీసుకువస్తే రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుందని, ఇందుకు మనం చేసేది కేవలం లిక్విడ్ గంజాయి వ్యాపారం అని నమ్మబలికాడు. మహలక్ష్మినాయుడు నగదును పట్టుకొని 2022 అక్టోబర్ 12న మునగపాక సమీపంలోకి ఉపేంద్ర చెప్పిన స్థలానికి వచ్చాడు. అక్కడ మహలక్ష్మినాయుడు తల వెనుక భాగంలో ఇనుప రాడ్‌తో బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మహలక్ష్మినాయుడు వద్ద ఉన్న నగదును తీసుకొని గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోయాడు. అక్కడ నుంచి ఎవరికీ అనుమానం రాకుండా మాకవరపాలెం సమీపంలో అద్దెకు దిగాడు. కొన్ని నెలల తరువాత లచ్చన్నపాలెం, జడ్.గంగవరంలో హత్యలకు పాల్పడ్డాడు. వలంటీర్ వద్ద రూ.లక్షలో రూ.75 వేలు, శివశంకర్ వద్ద నుంచి పట్టుకుపోయిన రూ.2 లక్షల నగదును ఉపేంద్ర నుంచి రికవరీ చేశామని సీఐ చెప్పారు. ఉపేంద్రను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించామన్నారు. ఈ కేసులను ఛేదించిన సిబ్బంది తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు, హెచ్‌సి శ్రీను, కానిస్టేబుల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ వచ్చారు.. వెళ్లారు..

- కేవలం 25 నిమిషాలు గడిపిన ప్రధాని
- ముందుగా తాను ప్రసంగించాలన్న చంద్రబాబు ఆశలు ఆవిరి
- పీఎం వెళ్లిన వెంటనే కదిలిన జనం
- ఖాళీ కుర్చీలకే బాబు ప్రసంగం



ప్రధాని మోదీకి ఏటికొప్పాక బొమ్మను బహూకరిస్తున్న స్థానిక బీజేపీ నేతలు

సాక్షి, అనకాపల్లి, కశింకోట: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జిల్లాలో కేవలం 25 నిమిషాలు గడిపారు. త్వరగా ప్రసంగం ముగించి, చకచకా వెళ్లిపోయారు. ఆయన ముందు తన వాగ్ధాటి ప్రదర్శించాలన్న టీడీపీ అధినేత చంద్రబాబు ఆశలు ఆవిరయ్యాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా కశింకోట మండలం ఉగ్గినపాలెంలో సోమవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ప్రధాని రిజర్వ్‌డుగా కనిపించారు. ఆయన కంటే ముందు ప్రసంగించాలని చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నించారు గానీ నాయకులను పరిచయం చేసుకొని, 20 నిమిషాలు మాట్లాడి ప్రధాని సభ నుంచి నిష్క్రమించారు. దీంతో చంద్రబాబు కంగుతిన్నారు. ప్రధాని వెళ్లిన వెంటనే సభ ఖాళీ అయిపోయింది. ఖాళీగా ఉన్న కుర్చీలను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించాల్సివచ్చింది. చంద్రబాబు మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావించినా సభప్రాంగణంలో కనీసం ఒక్కరు కూడా ఈలలు వేసిన సందర్భాలు లేవు. ప్రధానమంత్రి రాక సందర్భంగా భారీ పోలీసు భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు. డీఐజీ విశాల్ గున్ని, ఎస్పీ మురళీకృష్ణ తదితరులు పర్యవేక్షించారు. జాతీయ రహదారిపై సుమారు 3 గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిపి వేయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మొన్న ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించినప్పుడు కూడా బీజేపీ ప్రతినిధి అంటీముంటనట్టు వ్యవహరించారు. ఈరోజు ప్రధాని తన ప్రసంగానికే పరిమితమై 25 నిమిషాల్లో వెనుదిరిగారు. దీంతో టీడీపీ, జనసేన క్యాడర్‌లో ఉత్సాహం చల్లారిపోయింది.

భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం

- రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికల్ వలవన్
- చందనోత్సవ ఏర్పాట్ల పరిశీలన



చందనోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికల్ వలవన్

సింహాచలం: చందనోత్సవం రోజు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికల్ వలవన్ సూచించారు. ఈ నెల 10న నిర్వహించనున్న చందనోత్సవ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలను, ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎ. మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిలతో సమావేశం నిర్వహించారు.

ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చందనోత్సవం నిర్వహించాలని సూచించారు. భక్తులందరికీ కనీస సౌకర్యాలు కల్పించే దిశగా అందరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఉచిత క్యూలైన్ల భక్తులకు పెద్దపీట వేయాలని సూచించారు. ఈ సందర్భంగా చందనోత్సవ ఏర్పాట్లపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మరలా జగనన్నే వస్తాడు.. : బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన బాగుందని చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీకి చెబుతున్న గ్రామస్తులు



పండగలా దిగివచ్చావు : నాతవరం మండలం మాసంపల్లిలో పూలు జల్లుతూ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్‌కు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

ప్రచార పర్వం



ఎగరాలి వైఎస్సార్‌సీపీ జెండా : మునగపాక మండలం కాకరాపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



ఆటవిడుపుగా... : ఎస్.రాయవరం మండలంలో ప్రచారం విరామంలో చెరువు గట్టుపై కూర్చుని భోజనం చేస్తున్న పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



బామ్మా ఇదే మన గుర్తు: అనకాపల్లి యర్రావారివీధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



నీ చదువుకు అమ్మఒడి భరోసా: మాడుగుల మండలం కాశీపురంలో చిన్నారిని ఎత్తుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

జెండా కూలీలమేనా..



- టీడీపీ, జనసేన నడుమ కుంపటి
- పైసల పెత్తనం పచ్చనేతలకే
- జనసేన క్యాడర్‌లో అంతర్మథనం

నక్కపల్లి : టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య పైన పొత్తులు, లోన కత్తులుగా అన్నట్టుగా ఉంది. పోల్ మేనేజ్‌మెంట్ బాధ్యతలంతా తెలుగు తమ్ముళ్లకే అప్పగించడంతో జనసేన కార్యకర్తలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు పొత్తుధర్మం పాటిస్తూ టీడీపీ వాళ్లతో కలసి పనిచేస్తున్నా జనసేన కార్యకర్తలకు టీడీపీ నుంచి ఆశించినంత ఆదరణ, గౌరవం లభించడం లేదు. జన సైనికులను తెలుగు తమ్ముళ్లు నమ్మడం లేదు. పైసల పెత్తనమంతా తమ్ముళ్లే తీసుకోవడంతో జనసేన కార్యకర్తలు మేము జెండాలు మోయడానికేనా? మాకు కూడా గ్రామాల్లో మా వెంట తిరిగే అభిమానులు, కార్యకర్తలకు, పదోపరకో ఇచ్చుకునే ఠికానా కూడా లేదా? అని మండి పడుతున్నారు. పోలింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే జనసేన కార్యకర్తల కింకర్తవ్యం ఏంటన్న అంతర్మథనం మొదలయింది. మధ్యలో మేమున్నామంటూ బీజేపీ వాళ్లు కూడా హడావిడి చేస్తుండడంతో కూటమిలో పరిస్థితి మూడు ముక్కలాటలా తయారైంది. ప్రచారంలో పాల్గొనే వారికి, నామినేషన్‌కు, బహిరంగ సభలకు కార్యకర్తలను తీసుకువచ్చే విషయంలో పార్టీ ఇచ్చే డబ్బుల పెత్తనం తెలుగు తమ్ముళ్లే తీసుకున్నారు. పైసా కూడా జనసేన కార్యకర్తలకు ఇవ్వలేదు. వాళ్ల దగ్గరకి వెళ్లి మద్యం, బైక్ పెట్రోల్‌కు డబ్బులు ఇవ్వండి.. మా జనసేన కార్యకర్తలు కూడా వచ్చేరు కార్యక్రమానికి అని అడుక్కునే దుస్థితి ఏర్పడింది. దీనిని జనసేన కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రతి గ్రామంలోను జనసేన, టీడీపీలకు చెందిన ముఖ్యనాయకులు ఉన్నారు. వీరంతా కలిసే నామినేషన్ కార్యక్రమానికి, బహిరంగ సభలకు జనాన్ని సమీకరించారు. ఖర్చు పెట్టే విషయంలో మాత్రం టీడీపీ వాళ్లే పెత్తనం చేస్తుండడం జనసేన కార్యకర్తలకు మింగుడు పడడం లేదు. ఇదే విషయాన్ని కొంతమంది జనసేన నాయకులు అభ్యర్థి అనిత వద్ద ప్రస్తావిస్తే మిమ్మల్ని కలుపుకొని వెళ్లాలని మా నాయకులకు పదే పదే చెబుతున్నా పట్టించుకోవడం లేదు. మీకు ఇవ్వాల్సిన ఖర్చులు త్వరలోనే ఇస్తానని చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే ప్రచారంలో కూడా జనసేన నాయకులకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడంలేదు. పాయకరావుపేటతో పాటు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ జనసేన పరిస్థితి ఇదే. టీడీపీ, జనసేన పార్టీల్లో కూడా రెండు మూడు గ్రూపులు ఉన్నాయి. వీరంతా పోటా పోటీగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమై గ్రామస్థాయి కేడర్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. జనసేనలో ఒక వర్గం మాకు ఎంపీ ఓటే ముఖ్యం. ఎమ్మెల్యే ఓటుపై మేము ఒత్తిడి చేయం, ఎవరికి వేసుకున్నా మాకు అభ్యంతరం లేదనంటూ తేల్చి చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఎంతో లబ్ధి పొందాం కాబట్టి ఎమ్మెల్యే ఓటు వైఎస్సార్‌సీపీకి వేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

సీఎం రమేష్‌కు ఓటు ప్రజాస్వామ్యానికి చేటు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న
- గరిశింగి, వాలాబు పంచాయతీలో సీఎం రమేష్‌కు వ్యతిరేకంగా ప్రచారం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి: కడప నుంచి వలస వచ్చిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను ఘోరంగా ఓడించి తిప్పి పంపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అనకాపల్లి పార్లమెంట్ పరిధి ప్రజలకు పిలుపునిచ్చారు. దేవరాపల్లి మండలంలోని గరిశింగి, వాలాబు పంచాయతీల పరిధిలో వి.మాడుగుల, దేవరాపల్లి మండలాల సీపీఎం కార్యదర్శులు ఇరటా నర్సింహమూర్తి, బి.టి.దొరతో కలిసి సోమవారం ఆయన బీజేపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ సీఎం రమేష్ లాంటి పెత్తందారు పార్లమెంట్‌లో అడుగు పెడితే ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభ పెట్టి అడ్డదారుల్లోనైనా గెలవాలని జిల్లాలో వేలాది మంది కిరాయి వ్యక్తులను మోహరింప చేశారన్నారు. చిన్నపిల్లలతో సైతం ఎన్నికల ప్రచారం చేయించి విష సంస్కృతి బీజం వేశారని తెలిపారు. ప్రశాంత అనకాపల్లిలో అహంకారంతో అశాంతిని సృష్టిస్తున్న సీఎం రమేష్‌తో సహా బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలతో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు మూత పడ్డాయని చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లాంటి భారీ పరిశ్రమల అమ్మకానికి బీజేపీ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని చెప్పారు. బీజేపీకి ఓటు వేస్తే దేశానికి చేటు కలిగించినట్లేనని సీపీఎం నేత వెంకన్న ప్రచారంలో ప్రజలకు వివరించారు.

ప్రజలను మరోసారి మోసం చేసిన మోదీ, బాబు

- విభజన హామీలు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై పెదవి విప్పని నేతలు

అనకాపల్లి : కశింకోట మండలం రాజుపాలెంలో దేశ ప్రధాని మోదీ, తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రసంగంలో కనీసం ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మాట్లాడకపోవడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తనను గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపించేస్తానని, ప్రధానితో తనకు అత్యంత సాన్నిహిత్యం ఉందని చెప్పుకున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించవద్దని మోదీతో ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు. అడవి బిడ్డలను గోదారిలో ముంచారని అన్నారు. జిల్లాలో ప్రధాన అంశాలేవీ ప్రస్తావించకుండా విమర్శలకే పరిమితం అయ్యారన్నారు.

చెరకు రైతుల గురించి మాట్లాడిన మోదీ ఆ రైతులకు జీవనాధారమైన షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ గురించి ప్రస్తావించకపోవడం రైతులను మోసగించడం తప్ప మరొకటి కాదన్నారు. పేదరికం, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకుండా రామమందిర నిర్మాణాన్ని తమ విజయంగా చెప్పుకోవడం బాధ్యతారాహిత్యం అన్నారు. రానున్న ఎన్నికల్లో జట్టు కట్టిన మూడు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



కొత్త ఓటర్లకు పార్టీ కండువా వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



గొన్నవానిపాలెం గ్రామస్తులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన ధర్మశ్రీ



దద్దుగులలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



సరుగుడులో పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

అనకాపల్లి: స్థానిక గవరపాలేనికి చెందిన 24 మంది కొత్త ఓటర్లు వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలోని శారదానగర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తన స్వగృహంలో సోమవారం వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటల మనిషి కాదని, చేతలు సీఎం అన్నారు. ఐదేళ్ల పాలనలో పార్టీలకతీతంగా పలు సంక్షేమ పథకాలు అందించారన్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిలో ఎండీ అఫ్జల్, ఎండీ హుస్సేన్, గుల్‌బాస్, ఇస్లాం మియా, అత్త క్‌ఆలయ్‌తోపాటు మరో 19 మంది ఉన్నారు. పార్టీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, సూర్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ కె.ఎం.నాయుడు, భోగలింగేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్త వాసుపల్లి తాతయ్య పాల్గొన్నారు.

గొన్నవానిపాలెం టీడీపీ నాయకులు చేరిక

బుచ్చెయ్యపేట: మండలంలోని గొన్నవానిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన స్కూల్ కమిటీ చైర్మన్ చేబోలు శ్రీను, నాయకులు మరిసా అప్పారావు, తాడి శివ తమ కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి సోమవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామని, రానున్న ఎన్నికల్లో కరణం ధర్మశ్రీని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని పార్టీలో చేరినవారు తెలిపారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, సర్పంచ్ పినపోలు రాముయుడు, వైస్ సర్పంచ్ ముచ్చకర్ల వెంకునాయుడు, వార్డు మెంబర్లు మోదినాయుడు, రమణ, దాలిబాబు, మండల సచివాలయ కన్వీనర్ కె. అప్పలనాయుడు, స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు నమ్మి అప్పలరాజు, మాజీ సర్పంచ్ బోయిన నారాయణమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖ డైరెక్టర్ గుడాల ఆనంద్ పాల్గొన్నారు.

సరుగుడు మాజీ ఎంపీటీసీ, వార్డు సభ్యులు సహా 27 కుటుంబాలు చేరిక

నాతవరం: మండలంలో సరుగుడు, దద్దుగుల గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. ఈ రెండు గ్రామాల నుంచి ఆ పార్టీని వీడి 30 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. సరుగుడు, సుందరకోట గిరిజన పంచాయతీల్లో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. దద్దుగుల గ్రామం నుంచి సరుగుడు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బి.మహాలక్ష్మి, చల్లా లక్ష్మి, కె.రమణమ్మ, గొల్లపల్లి స్వామి, జుర్రా పార్వతి, నందా లక్ష్మి, గొల్లపల్లి లక్ష్మితోపాటు మరి కొంతమంది పార్టీలో చేరారు. సరుగుడు గ్రామం నుంచి పొత్తూరి మోహిని, చదల వరలక్ష్మి, ఇద్దరు పంచాయతీ వార్డు మెంబర్లు, వార్డు మాజీ మెంబరు జుర్రా సింహాచలం, తెలికెట్టి చింతల్లి, లోచల రాజులు, కోసూరి నూకాలమ్మ, కోకూరి పార్వతి, జుర్రా అణు, శివకుమార్, కోకూరి లక్ష్మి, లోతా రమణ, కె. వెంకటరమణ, సాదనపల్లి దుర్గా ప్రసాద్, తదితరులు చేరారు. వీరంతా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తమ ప్రాంతంలో పోడు సాగు చేసుకుంటున్న వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడమేగాక రైతు భరోసా నగదు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గణేష్ సహకారంలో గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరు బండి గంగారాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పత్తి శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

దోచుకోవడానికే కడప నుంచి బీజేపీ అభ్యర్థి

- నాన్‌లోకల్‌ను వ్యతిరేకించే అయ్యన్నపాత్రుడు మద్దతు సిగ్గుచేటు
- సీఎం రమేష్‌పై వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి కిశోర్ ధ్వజం




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి కిశోర్‌కుమార్

తుమ్మపాల: ప్రశాంతమైన జిల్లాలో ప్రజలను, పోలీసులను బెదిరిస్తూ ఈ ప్రాంతాన్ని కడప ఫ్యాక్షనిజం చేస్తున్నారని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి కిశోర్‌కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనకాపల్లి పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. గత నెల చోడవరంలోను, ఈ నెల మాడుగుల నియోజకవర్గంలో రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తూ అశాంతి యుత వాతావరణం సృష్టించారన్నారు. బ్యాంకులను దోపిడీ చేసి వేల కోట్లు కొట్టేసిన వ్యక్తి ఇప్పుడు జిల్లాలో ఫార్మాసిటీ, మన ప్రాంత సంపదను దోచేసేందుకే వచ్చాడన్నారు. 12 ఏళ్ల రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రానికి చేసిన ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. కడప, తెలంగాణ నుంచి మూడు వందల కార్లలో మందీ మార్బలంతో వచ్చి ఇక్కడ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రాంత ప్రజలను నమ్మని విషయాన్ని గమనించాలన్నారు. తన కుమారుడ్ని ఎంపీ చేయడం కోసం లోకల్ వ్యక్తులకే టికెట్ ఇవ్వాలని మాట్లాడిన అయ్యన్నపాత్రుడు సీఎం రమేష్ విషయంలో మౌనం దాల్చడం వెనుక మతలబు ఏంటో ప్రజలకు చెప్పాలన్నారు. 40 ఏళ్లుగా రాజకీయాలు చేస్తూ మంత్రిగా పనిచేసిన జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అనకాపల్లి నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి ఒకటైనా చేశారా అని ప్రశ్నించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ చట్టం ద్వారా అందరికీ న్యాయం కలుగుతుందని పీఏసీ చైర్మన్‌గా ఉన్న టీడీపీ నేత పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో చెప్పిన విషయాలను గమనించాలన్నారు. నీతిఆయోగ్, రాష్ట్రపతి ఆమోదంతో కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ పథకాలతో రాష్ట్రం నాశనమై శ్రీలంకతో పోల్చిన టీడీపీ నాయకులు ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ పెట్టిన మేనిఫెస్టో ఎలా సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర బడ్జెట్ మించి ఉన్న సూపర్ సిక్స్ ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మలసాల రమణరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గాజు గుర్తుపై హైకోర్టులో రిట్

తుమ్మపాల : అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుండి దళిత బహుజన్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు కేటాయించిన గాజు గ్లాస్ గుర్తును మార్చడంపై రాష్ట్ర హైకోర్టులో రిట్ అప్పీల్ చేశానని వడ్లమూరి కృష్ణస్వరూప్ ఒక ప్రకటనలో తెలిపారు. అది మంగళవారం చీఫ్ జస్టిస్ బెంచి ముందు విచారణకు వస్తుందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్, కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమీషన్ మీద వత్తిడి తీసుకొచ్చి తనకు నష్టం జరిగేలా గుర్తును మార్చారన్నారు. వారిపై చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై హైకోర్టులో వాదనలు వినిపిస్తామని ఆయన తెలిపారు.

సమ్మర్ స్పెషల్ రెండు ట్రిప్పులు మాత్రమే...



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సంబల్‌పూర్-కాచిగూడ- సంబల్‌పూర్ మధ్య దువ్వాడ మీదుగా స్పెషల్ రైళ్లు జూన్ 24వ తేదీ వరకు 7 ట్రిప్పులు నడుపుతున్నట్లు ఆదివారం వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. కానీ వీటిని కుదించి కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే నడుపుతున్నట్లు సోమవారం మరో ప్రకటనలో తెలిపారు.

- సంబల్‌పూర్-కాచిగూడ(08323) సమ్మర్‌స్పెషల్ సంబల్‌పూర్‌లో ఈ నెల 13, 20 తేదీల్లో సోమవారం రాత్రి 9గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.20గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.25గంటలకు బయల్దేరి ఆదేరోజు రాత్రి 9.50గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాచిగూడ-సంబల్‌పూర్(08324) సమ్మర్‌స్పెషల్ కాచిగూడలో ఈ నెల 14,21 తేదీల్లో మంగళవారం రాత్రి 11.20గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30గంటలకు దువ్వాడ చేరుకుని, 12.35గంటలకు బయల్దేరి బుధవారం రాత్రి 11.45గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది.

బంధువులతో సరదాగా ఈతకు వెళ్లి..

- కాలు జారి బావిలో పడి యువకుడి మృతి



మృతుడు చలపాక పాల్ సరోజ్(23)

యలమంచిలి రూరల్: సరదాగా బంధువులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు కాలుజారి బావిలో పడి ప్రాణాలు కోల్పోయాడు. మండలంలోని సోమన్నపాలెంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. యలమంచిలి రూరల్ పోలీసులు వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ వద్ద పాత బోయిన్‌పల్లిలో స్వర్ణధామనగర్‌కు చెందిన చలపాక పాల్ సరోజ్(23) రెండ్రోజుల క్రితం కశింకోటలో తన మేనత్త కుమార్తె రజస్వల కార్యక్రమానికి వచ్చాడు. అక్కడి నుంచి వరుసకు సోదరుడైన గౌతంతో యలమంచిలిలో బంధువు తలుపోలు రమణ ఇంటికి వచ్చాడు. రమణ కుమారుడు ప్రణీత్‌తో కలిసి ముగ్గురూ యలమంచిలి మండలం సోమన్నపాలెం వద్ద బావిలో ఈతకు వెళ్లారు. గౌతం, ప్రణీత్ బావిలోకి దిగి ఈత కొడుతున్నారు. వీరిని చూసి ఈత రాకపోయినా పాల్ సరోజ్ బావిలోకి దిగేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడి నీట మునిగాడు. మిగిలిన ఇద్దరూ అతడ్ని కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో ఎర్రవరంలో చంద్రగిరి లక్ష్మణ్‌ను పిలిచారు. అతను వచ్చి పాల్ సరోజ్‌ను బయటకు తీసి ఆటోలో యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు పాల్ సరోజ్ తండ్రి రాజు పాత బోయిన్‌పల్లిలోని ఓ అపార్టుమెంట్లో వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా, మృతుడు పాల్ సరోజ్ టాటా క్యాపిటల్ ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. కుమారుడి మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు యలమంచిలి చేరుకుని మృతదేహం వద్ద కుప్పకూలిపోయారు. అయ్యో దేవుడా ఎంత పనిచేశావు అంటూ గుండెలు బాదుకుంటూ రోదించారు. మృతదేహానికి యలమంచిలి మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు యలమంచిలి రూరల్ ఎస్సై పైల సింహాచలం సోమవారం రాత్రి తెలిపారు.

క్లుప్తంగా

భరత్‌కుమార్‌ను గెలిపిస్తే సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌ను గెలిపిస్తే అనకాపల్లి కేంద్రంగా సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ఆపార్టీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భూటకపు మేనిఫెస్టోతో టీడీపీ మరోసారి మోసం చేసేందుకు సిద్ధంగా ఉందని, 14 సంవత్సరాల చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో బలహీన వర్గాల ప్రజలకు ఒరిగేదిఏమీ లేదని పేర్కొన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీకి ప్రజలు బుద్ధిచెబుతారని తెలిపారు.

బాధిత రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న చిన్ని యాదవ్

రాంబిల్లి: నేవీ ప్రహరీ నిర్మాణంతో ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు చిన్ని యాదవ్ కోరారు. పెదకలవలాపల్లిలో రైతులు చేస్తున్న ధర్నా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

15న అనకాపల్లి మండల పరిషత్ సమావేశం

అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని ఎంపీడీవో పి.వి.వి.ఎం. మోహన్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలపరిషత్ అధ్యక్షుడు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని, మండలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

తల్లిదండ్రులకు పాదపూజ

కె.కోటపాడు: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సోమవారం పాదపూజ చేశారు. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వారోత్సవాల సందర్భంగా స్థానిక రామాలయంలో పాదపూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మండల సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు అన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాల కు చెందిన బాలవికాస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	: రాజా
శబరి	: సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటే అడక్కు	: పర్తిసాయి
రత్నం	: వెంకటేశ్వర
పారిజాత పర్వం	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 1,870 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,500	4,710
మొదటి రకం	3,900	4,880
రెండో రకం	3,710	4,340
మూడో రకం	3,220	3,640

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-2 యూనిట్లు, బి పాజిటివ్-14 యూనిట్లు, ఒ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (ఫోన్ 9703619706) నంబరును సంప్రదింవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 323 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ను సంప్రదించవచ్చు.

డెవలప్‌మెంట్ వాచ్

ఆహా... ఆస్పత్రులు



కశింకోటలో నాడు-నేడులో అభివృద్ధి చేసిన పీహెచ్‌సీ



తాళ్లపాలెంలో పీహెచ్‌సీ భవనం

గతంలో ప్రభుత్వ ఆస్పత్రులంటే శిథిల భవనాలు, చాలీచాలని మందులు, వసతుల లేమి, అందుబాటులో ఉండని వైద్యులు.. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టడంతో పీహెచ్‌లన్నీ చూడముచ్చటగా రూపుదిద్దుకున్నాయి. అధునాతన వసతులు అందుబాటులోకి వచ్చాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగు పడ్డాయి. మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. కశింకోట పీహెచ్‌సీలో రూ.40 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మించి, మౌలిక వసతులు కల్పించి అందంగా తీర్చిదిద్దారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ రూపురేఖలను రూ.25 లక్షల వ్యయంతో మార్చారు. దీని ప్రాంగణంలో రక్త పరీక్షల ల్యాబ్ భవనాన్ని రూ.50 లక్షలతో నిర్మించారు. తుది మెరుగులు దిద్దుకుంటోంది. తుమ్మపాల, తరగంపూడి పీహెచ్‌సీలను రూ.లక్షలతో అభివృద్ధి చేశారు. ఒక్కొక్క పీహెచ్‌సీలో ఇద్దరేసి చొప్పున వైద్యులను నియమించి వైద్య, ఆరోగ్య సేవలను మెరుగుపర్చారు. దీంతో గతంలో పీహెచ్‌సీలకు వెళ్లడానికి ఇష్టపడని వారుసైతం పీహెచ్‌సీకు వెళ్లి వైద్య సేవలు సకాలంలో పొందుతున్నారు.

– కశింకోట



తాళ్లపాలెం పీహెచ్‌సీలో తుది మెరుగులు దిద్దుకుంటున్న రక్త పరీక్షల ల్యాబ్ భవనం



తుమ్మపాల పీహెచ్‌సీ



అనకాపల్లి మండలం తగరంపూడి పీహెచ్‌సీ

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు



పల్లపు ఆనందపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు జగన్నాథం



ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ఉమ్మలాడ మాజీ వార్డు సభ్యులు

• ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తి రాజు

మునగపాక: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి మాయమాటలు నమ్మవద్దని, మోసపూరిత హామీలతో ప్రజల వద్దకు వస్తున్న చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు తెలిపారు. మండలంలోని కాకరాపల్లి, రాజుపేట,పల్లపు ఆనందపురం,కుమారపురం గ్రామాల్లో సోమవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రజారంజకంగా సాగుతోందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తి రాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,రాజుపేట సర్పంచ్ కిలాడి దేముడు, పార్టీ నేతలు పిట్టా మంగారెడ్డి, దుబాసి నాయుడు, నాగిరెడ్డి, ఎం.సంతోష్, ఉప సర్పంచ్ పిట్టా పెదమంగారెడ్డి,పార్టీ నాయకులు వాసా సన్యాసిరావు,దల్లి సూరిబాబు,కర్రి పెదబ్బాయి.పల్లెల ప్రకాశరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

పలువురు వార్డు మాజీ సభ్యుల చేరిక

ఉమ్మలాడ నుంచి పలువురు వార్డు మాజీ సభ్యులు, ఇతర పార్టీలకు చెందిన నాయకులు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యలమంచిలిలో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఉమ్మలాడ వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిశెట్టి రామకృష్ణ(ఎస్ఆర్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ,వైఎస్సార్‌సీపీ నేత సూరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంగా ఆశీర్వదించండి



నెయ్యిలవీధిలో మలసాల భరత్‌కుమార్‌కు హారతి ఇస్తున్న మహిళ

అనకాపల్లి: అభివృద్ధి, సంక్షేమం చూసి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక 84వ వార్డులో నెయ్యిలవీధి, యర్రవారివీధి, చేపలబజార్ తదితర ప్రాంతాల్లో సోమవారం ప్రచారం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హారతులు ఇచ్చారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడు గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గాడి సుజాత, పార్టీ నాయకులు ఏడువాకల నారాయణరావు, మాధురినాయుడు, పి.బాబు, పాముల గోపి, డి.సత్తిబాబు, వై.శ్రీను, జగదీష్, వెంకటేష్, రామచంద్రరావు, మారిశెట్టి శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

– స్థానిక సుంకరమెట్ట జంక్షన్ నుంచి రామచంద్ర థియేటర్ వరకూ సోమవారం రాత్రి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు బి.కాశీవిశ్వనాథం, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 80,81 వార్డుల ఇన్‌చార్జ్‌లు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

– మండలంలో మారేడుపూడిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సోమవారం రాత్రి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, గ్రామపార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం



యలమంచిలిలో పోస్టల్ ఓట్లు వేయడానికి వచ్చి వివరాలు నమోదు చేయించుకుంటున్న ఉద్యోగులు



అనకాపల్లిలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించి వస్తున్న ఎంపీ బి.వి.సత్యవతి

యలమంచిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. యలమంచిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్వో అప్పలస్వామి మాట్లాడుతూ నాలుగు మండలాల నుంచి 1,026 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు నమోదు చేసుకున్నారని, వీరిలో 834 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. మరో రెండు రోజుల పాటు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు కూడా ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక కౌంటర్, పోలింగ్ కేంద్రం వద్ద నాలుగు హెల్ప్ డెస్క్‌లు, నాలుగు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఓటింగ్ జరిగిందని చెప్పారు.

అనకాపల్లిలో ...

అనకాపల్లి: స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్నహైస్కూల్‌లో ఏర్పాటు చేసి ఫెసిలిటేషన్ సెంటర్‌లో పలు శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సోమవారం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. 2,734 మందికి గాను మొదటిరోజు 914 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఐదు బూత్‌లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఎం.జాహ్నవి తెలిపారు. మంగళ, బుధ వారాల్లో కూడా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని ఆమె చెప్పారు. ఫెలిలిటేషన్ సెంటర్‌ను ఎంపీ బి.వి.సత్యవతి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, డీటీ శ్రీరామ్మూర్తి, వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక: సార్వత్రిక ఎన్నికలను సవాల్‌గా తీసుకొని నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. స్థానిక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో సోమవారం పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పార్టీముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విస్తృతంగా ప్రచారం నిర్వహించి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజులను గెలిపించాలని కోరారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, పార్టీ నేతలు ఆడారి కాశీబాబు,టిక్కలి కొండలరావు పాల్గొన్నారు.

పల్లెల్లో విస్తృతంగా ప్రచారం



కశింకోటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు



జమాదులపాలెంలో గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



టి.సిరసపల్లిలో డమ్మీ ఈవీఎంలతో అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి



కాకరాపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న సచివాలయ కన్వీనర్ మంగారెడ్డి



గోకివాడలో ప్రచారం చేస్తున్న సుకుమారవర్మ

కశింకోట: మండలంలోని అగ్రహారం, గాడి వీధి, పందిరి వీధి, జాలారి పేట, కోటదిబ్బ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు సోమవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జమాదులపాలెంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రచారం చేశారు.

మునగపాక: ఐదేళ్ల కాలంలో జరిగిన మేలును గుర్తించి త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి కోరారు. ఆదివారం రాత్రి ఆమె గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు,యు.వి. రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కాకరాపల్లిలో సచివాలయ కన్వీనర్ పిట్టా చినమంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉప సర్పంచ్ పిట్టా పెదమంగారెడ్డి,పార్టీ నాయకులు మొక్కా సంతోష్, నాగిరెడ్డి,సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

రాంబిల్లి: జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు తనయుడు సుకుమారవర్మ(తేజ) అన్నారు.

సోమవారం రాత్రి ఆయన మూలజంప, మూలకొత్తూరు, నారాయణపురం, అప్పారాయుడుపాలెం, హరిపురం గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హామీలు నమ్మవద్దన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు, ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పిన్నంరాజు కిషోర్, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ ఎన్వీ సూర్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ కె.రామకృష్ణ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల నిర్వహణకు అనుమతులు



కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు పై ప్రచారం

ఎస్.రాయవరం : కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల నిర్వహణకు అనుమతులు వచ్చాయని ప్రధానోపాధ్యాయులు సకురు సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలో అదనపు జూనియర్ కళాశాలలు మంజూరు భాగంగా ఎస్.రాయవరం మండలానికి కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో కళాశాల నిర్వహించేందుకు అనుమతులు వచ్చాయన్నారు. ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. మొదటి ఏడాది ఎంపీసీ, బైపీసీ గ్రూపులతో కళాశాల నిర్వాహణ ఉంటుందన్నారు. జూన్ మొదటి నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు సోమవారం పాఠశాల ప్రాంగణంలో కళాశాల ఏర్పాటు ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కొందరు విద్యార్థులకు అడ్మిషన్లు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కళాశాల అడ్మిషన్ల క్యాంపెయిన్ కూడా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి, పక్కన వైస్ ఎంపీపీలు బుల్లిలక్ష్మి, గంగాభవానీ

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగా భవానీ హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అభివృద్ధిపై సమీక్షలు లేకుండానే ముగించారు. ప్రధానంగా మంచినీరు, విద్యుత్ తదితర ప్రాధాన్యత సమస్యలు ఉంటే చెప్పాలని ఎంపీడీవో కోరగా, ఎవరూ స్పందించక పోవడంతో కొద్ది సేపటి తర్వాత సమావేశాన్ని ముగించారు. ఎంపీపీ పదవికి కిలపర్తి రాజేశ్వరి ఇటీవల రాజీనామా చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో అధ్యక్షతన సమావేశా న్ని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి జి.వి.రమణ, ఎంపీటీసీలు పోతల వెంకటరావు, బండి గౌరమ్మ, గంధం రామకృష్ణ, చిరికి లక్ష్మి, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీరు, టెంట్లు తప్పనిసరి



జంగాలపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఎంపీడీవో జి.చంద్రరావు ఉపాధి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మండలంలోని జంగాలపల్లి, పి.పి.అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్ షీట్లను పరిశీలించి సిబ్బంది, కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పనులకు రాకుండా మస్తర్లు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

14 పంచాయతీల్లో బూడి, అనురాధ ప్రచారం నేడు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ మంగళవారం 14 పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. ములకలాపల్లి, ఎస్.గజపతినగరం, ఎం.అలమండ, చిననందిపలి,గరిశింగి, తెనుగుపూడి,గరిశింగి. వాకపల్లి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేస్తారన్నారు. ఆయా గ్రామాల్లో స్థానిక పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

గొడుగుల పంపిణీ



పేదలకు గొడుగులు అందజేస్తున్న దృశ్యం

మునగపాక: స్థానిక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో మునగపాక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు గొడుగులు పంపిణీ చేశారు. వ్యాపార వేత్త ఆడారి అప్పలనాయుడు చేతులమీదుగా వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలంక సూర్యప్రకాశరావు, కింతాడ మోహనరావు, దాడి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కె.జె.పురం గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజీనామా లేఖలను సచివాలయ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

మాడుగుల రూరల్: కె.జె.పురం మేజర్ గ్రామ పంచాయతీలో ముగ్గురు గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను సచివాలయ కార్యదర్శి ప్రవీణ్‌కు అందజేశారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈర్లె అనురాధ, బూడి ముత్యాలనాయుడులకు మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు.

ఎన్నో ఏళ్ల పాటు నిరాదరణకు గురైంది..ఎక్కడ చూసినా అసౌకర్యాలు రాజ్యమేలేవి.. ప్రజలు పడుతున్న అవస్థలే కనిపించేవి..శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాలు, పాఠశాలలు, కనీస సౌకర్యాలు లేని ఆస్పత్రులు ఇలా ఒకటేమిటి అన్నింటా దైన్యమే.. ఎన్నాళ్లీ అవస్థలు.. ఎప్పుడు వీటి నుంచి విముక్తి అని మథన పడుతున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ అధికార పగ్గాలు చేపట్టింది.. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నం నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. దీర్ఘకాలిక సమస్యలెన్నింటినో ప్రభుత్వం పరిష్కరించి నర్సీపట్నం ప్రజల మన్ననలు పొందింది. నాలుగు దశాబ్దాలుగా నిరాదరణకు గురై, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో ప్రగతి పరవళ్లు తొక్కుతోంది.



రూ. 10.6 కోట్ల వ్యయంతో విస్తరణ పూర్తయిన నర్సీపట్నం మెయిన్ రోడ్డు

నర్సీపట్నం.. అభివృద్ధికి పట్టం



నర్సీపట్నం: నాలుగు దశాబ్దాలుగా నిరాదరణకు గురై, కనీస స్థాయిలో కూడా అభివృద్ధికి నోచుకోని నర్సీపట్నం నియోజకవర్గం గడచిన ఐదేళ్లలో ప్రగతి పథంలో పరుగులుతీస్తోంది. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దీర్ఘకాలికంగా పరిష్కారంకాని సమస్యలెన్నో పరిష్కారమయ్యాయి. పంచాయతీ భవనాలు, ప్రభుత్వ బడులు కార్పొరేట్ హంగులతో చూడముచ్చట గొలుపుతున్నాయి. కనీససౌకర్యాలు లేని ఆస్పత్రుల్లో ఇప్పుడు ఆధునాతన వైద్య పరికరాలతో వైద్యసేవలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వం సకల సేవలు అందిస్తోంది. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లతో గ్రామాలు, వార్డులు కళకళలాడుతున్నాయి. నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధితో పాటు వైఎస్సార్‌సీపీ పారదర్శకపాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో నవరత్నాలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా 3,87,242 లబ్ధిదారులకు డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.1,302 కోట్లు ప్రయోజనం చేకూరింది. చాలా ఏళ్ల పాటు నియోజకవర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థికే పట్టం కట్టినప్పటికీ ఎటువంటి అభివృద్ధి జరగలేదు.

అందాల లోగిళ్లు

ప్రతి పేదవాడికి సొంత గూడు ఉండాలని జగనన్న ప్రభుత్వం సంకల్పించింది. ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో దాదాపు 4,756 మంది లబ్ధిదారులకు రూ.117 కోట్ల విలుగల భూమిని సేకరించి 72 గజాల చొప్పున ఉచితంగా పంపిణీ చేసింది. ఇంటినిర్మాణానికి రూ.1.85 లక్షల చొప్పున ఆర్థిక సాయంగా అందజేసింది. ఈ ఐదేళ్ల కాలంలో రూ.37.05 కోట్ల వారికి మంజూరు చేసింది. జగనన్నకాలనీలుగా నామకరణం చేసుకుని లబ్ధిదారులంతా తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి గృహప్రవేశాలు కూడా చేసుకుంటున్నారు.కాలనీల్లో విద్యుత్, తాగు నీరు, రోడ్లు, కాలువలు నిర్మించారు. వాడుకనీటి సదుపాయం కూడా కల్పించారు.


జగనన్న కాలనీలో అందంగా నిర్మించిన ఇళ్లు

సాగు, తాగు నీరు

2004లో డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తాండవ జలాశయం కుడి, ఎడమ కాలువలను రూ.55 కోట్లతో ఆధునికీకరించారు. నియోజకవర్గంతో పాటు పక్కనే ఉన్న తుని నియోజకవర్గంలోని 53 ఎకరాలకు సాగునీరు అందించారు. 2019లో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాండవ జలాశయం కింద మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు తాండవ ఏలేరు ఎత్తిపోతల పథకానికి రూ.470 కోట్లు కేటాయించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం రూ.166.89 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. మున్సిపాలిటీ ప్రజలపై టీడీపీ ప్రభుత్వం మోపిన పన్నుల భారాన్ని ఎన్నికల హామీల్లో భాగంగా 25 శాతానికి తగ్గించి ఊరట కలిగించింది.


మున్సిపాలిటీలో వేస్తున్న భారీ తాగునీటి పథకం పైపులైను

ప్రభుత్వ బడులు నాడు-నేడు


నాడు- నేడులో విద్యార్థులకు సమకూరిన బెంచీలపై కూర్చున విద్యార్థులు

నాడునేడు పథకం ద్వారా నియోజకవర్గంలో మొదటి రెండు విడతల్లో 241 పాఠశాలలకు రూ.68.35 కోట్లు కేటాయించారు.

నూతన భవనాలు, అదనపు తరగతి గదులు, ఆధునికవసతులతో కూడిన మరుగుదొడ్లు, రన్నింగ్‌వాటర్, తాగునీరు, మినరల్ వాటర్ ప్లాంట్లు, విద్యార్థుల కోసం డిజిటల్‌క్లాసు రూములు, ప్రహరీలు, క్రీడామైదానాలు, బెంచీలు,పాఠశాలలకు ఆకర్షణీయమైన రంగులు వంటి అభివృద్ధి పనులు చేపట్టారు.

మెడికల్ కళాశాల నిర్మాణం.. ప్రజలకు వరం

మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ కళాశాల నియోజకవర్గ ప్రజలకు వరంలా పరిణమించింది.


నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనం

61 సచివాలయాలు... 55 ఆర్బీకేలు


చీడిగుమ్మలలో నిర్మించిన సచివాలయం

సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాటలు వేసింది. సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చి గ్రామంలోనే 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని నియమించింది. స్వపరిపాలనలో భాగంగా రూ.20.10 కోట్ల వ్యయంతో 61 గ్రామ సచివాలయాలు, రూ.12 కోట్ల వ్యయంతో 55 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. నర్సీపట్నంలో రూ.75 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను అన్నదాతల ప్రయోజనార్థం ఏర్పాటు చేశారు. ఇక్కడ నలుగురు సిబ్బంది సేవలందిస్తున్నారు.


రైతు భరోసా కేంద్రంలో కియోస్క్‌లో నమోదు చేసుకుంటున్న రైతు

ఆరోగ్య భద్రతకు పెద్ద పీట

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో రూ.8.89 కోట్లతో అదనపు భవనాలను నిర్మించారు. మరో రూ.10 లక్షలతో ఎస్ఎన్‌సీయూ యూనిట్, రూ.4 కోట్లతో రెండు అర్బన్ హెల్త్‌సెంటర్ల భవనాలను నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే.


నాతవరంలో నిర్మించిన పీహెచ్‌సీ భవనం

జగనన్న పుణ్యమే..



నాటి టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు జనం తేడా గమనించారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశాం. పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందించాం. సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయి. సంక్షేమం, అభివృద్ధికి సుమారు రూ. 4వేల కోట్లు వెచ్చించాం. ఇంత పెద్ద మొత్తంలో గత టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేయలేదు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా ప్రతి పైసా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి అభివృద్ధికి నోచుకోని ఆర్లిలోవ రహదారి, నర్సీపట్నం మెయిన్ రోడ్డు అభివృద్ధి, మెడికల్ కళాశాల నిర్మాణం చరిత్రలో నిలిచిపోతాయి. ఇదంతా జగనన్న పుణ్యమే.

– పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్యే, నర్సీపట్నం నియోజకవర్గం

పథకం	లబ్ధిదారులు	నగదు (రూ. కోట్లలో)
రైతు భరోసా	42,717	167.5
జగనన్న అమ్మ ఒడి	40,450	148
చేయూత	23,318	127.5
ఆసరా	55,973	158
కాపునేస్తం	1,967	9
వాహన మిత్ర	1,506	5.22
సున్నా వడ్డీ	6,129	12
విద్యా దీవెన	19,192	25
వసతిదీవెన	15,444	11
నాడునేడు పాఠశాలలు	232	68.35
పింఛన్ కానుక	61,411	398
ఆరోగ్యశ్రీ	6,120	30
గృహనిర్మాణం	4,756	117
సున్నా వడ్డీ (పంట రుణాలు)	1,245	1.5
ఈబీసీ నేస్తం	4,205	1.25
చేదోడు	3,124	6.36

ప్రజల ముంగిటకే పాలన

సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామంలోనే 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచారు. సమస్యల పరిష్కారం, ధ్రువీకరణపత్రాల కోసం మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే అన్ని పనులు జరిగేలా చర్యలు చేపట్టారు. అవ్వాతాతలు పింఛను తీసుకోవడానికి పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు వలంటీరు వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చి ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను ఇంటికి తీసుకెళ్లి అందించే కార్యక్రమం చేపట్టారు.

తీరిన 'దారి'ద్ర్యం

దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోని నర్సీపట్నం మెయిన్ రోడ్డును రూ.10.60 కోట్లతో 100 అడుగులకు విస్తరించారు. మరో రూ.6 కోట్లతో వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి డాన్ బాస్కో కళాశాల వరకు చేపట్టిన ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. గొలుగొండ మండలంలో ఆర్లిలోవ అటవీ ప్రాంతంలో అర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం అటవీ అనుమతులు ఇచ్చింది. రూ.3.8 కోట్లతో మూడున్నర కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ పూర్తయింది.

నెరవేరని అయ్యన్నపాత్రుడు హామీలు

ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నర్సీపట్నం ప్రజలకు అయ్యన్నపాత్రుడు ఒరగబెట్టింది ఏమీ లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఒక సారి ఎంపీగా, ఆరు సార్లు మంత్రిగా పనిచేసిన ఆయన నర్సీపట్నం ప్రజలకు ఇచ్చిన హామీలను కనీసస్థాయిలో నెరవేర్చలేకపోయారు.

నెరవేరని 'మెయిన్' వాగ్దానం

ప్రధానంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెయిన్ రోడ్డు విస్తరణ చేయాల్సిన అవసరం ఉందని మంత్రిగా ఉన్నప్పుడు అయ్యన్నపాత్రుడు చాలా సందర్భాల్లో పేర్కొన్నారు. వంద అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపట్టేందుకు ఆర్థిక శాఖ ఆమోదం లభించిందని 2018 జనవరి 2న మంత్రి హోదాలో అయ్యన్న ప్రకటించారు. రోడ్డు విస్తరణకు రూ.160 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. పరిహారం చెల్లించేందుకు 2019 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయిస్తుందని తెలిపారు. రూ.40 కోట్లు అర్‌అండ్‌బీ శాఖ ద్వారా భవన యజమానులకు నష్ట పరిహారం కింద చెల్లిస్తామని ప్రకటించారు. ఎన్నికలకు ముందే రోడ్డు విస్తరణ జరిగి తీరుతుందని అప్పట్లో స్పష్టం చేసినప్పటికీ నెరవేరలేదు.

'అండర్ గ్రౌండ్'లోకి హామీ

అయ్యన్న పాత్రుడు ఇచ్చిన ముఖ్యమైన హామీల్లో ఒకటైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కూడా కార్యరూపం దాల్చలేదు. సుమారు 65 వేల జనాభా ఉన్న మున్సిపాలిటిలో 130 కిలో మీటర్ల పొడవుతో రూ.77 కోట్లతో పక్కా డ్రైనేజీ ఏర్పాటు చేస్తానని అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. అప్పట్లో ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినా కార్యరూపం దాల్చలేదు.

'పెద్ద' బూటకం

అయ్యన్నపాత్రుడు ఇచ్చిన మరో ముఖ్యమైన హామీ నర్సీపట్నం పెద్దచెరువును ట్యాంక్ బండ్‌గా తీర్చిద్దడం.ఇది కూడా కార్యరూపం దాల్చలేదు. ట్యాంక్ బండ్ ప్రకటనలకే పరిమితమైంది.

'నీటి'మీద రాతలు

మున్సిపాలిటీ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రూ.120 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తున్నామని అయ్యన్నపాత్రుడు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. అనేక హామీలు ఇచ్చినప్పటికీ అయ్యన్నపాత్రుడు ఏ ఒక్కటీ నెరవేర్చలేకపోయారు.

నా ఇల్లు నా చిరునామా



నాకూ సొంతిల్లు ఉంది..



నా పేరు వారాధి కృష్ణవేణి. నేను ఒంటరి మహిళను. మండలంలో రేబాక గ్రామంలో నా తల్లితో జీవించేదాన్ని. ఆమె మరణించడంతో ఒంటరిగానే జీవిస్తున్నాను. నాకు సొంతిల్లు లేని విషయం గ్రహించిన మా వలంటీర్ నాతో దరఖాస్తు చేయించారు. కొన్ని రోజులకు మా గ్రామంలో నిర్మించిన జగనన్న లేఅవుట్‌లో నాకు స్థలం మంజూరైంది. వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాను. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాలుగు విడతల్లో నా బ్యాంకు ఖాతాలో ఇంటి నిర్మాణానికి చెందిన పైకం వేశారు. ఇసుక, సిమెంట్, ఇనుముతో కలిపి మొత్తం రూ.1 లక్ష, 80 వేలు అందించారు. ఇంటి పనులు పూర్తి చేసుకున్నాను. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లోనే ఉంటున్నాను. నిరుపేదననుకున్న నాకు ఇప్పుడు సొంత ఇల్లుంది. ప్రభుత్వం నన్ను ఇంటి యాజమానురాలిని చేసింది. ఒంటరి మహిళ పింఛను కూడా వస్తుంది. ఇలాంటి ప్రభుత్వాలు ఉంటే నాలాంటి దిక్కు లేని మహిళలు జీవితమంటే భయపడనవసరం లేదు.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

ఓటర్లు	2,06,394
పురుషులు	1,00,407
మహిళలు	1,05.978
ఇతరులు	9
పోలింగ్ కేంద్రాలు	246

ఒడిలో లక్కబొమ్మ...! పరిశ్రమల పట్టుగొమ్మ...!!

దక్షిణ కాశీశ్వరుడు కొలువైన ఊరు...నిరంతర జలధార పంచదార్ల...పక్షుల కిలకిలారావాల ఆవ...ప్రకృతి అందాల తీరం.. ఇదీ యలమంచిలి ముఖచిత్రం. సెజ్ పరిశ్రమల కేంద్రంగా విలసిల్లుతున్న యలమంచిలి నియోజకవర్గం సముద్ర తీర ప్రాంతానికి ఆనుకొని నేవల్ బేస్‌కు కూడా చోటిచ్చి జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత పొందింది. ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన ఈ నియోజకవర్గం 1952లో ఏర్పాటవగా ఇప్పటి వరకూ 15 సార్లు ఎన్నికలు జరిగాయి 8మంది వివిధ పార్టీల నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.


కొండకర్ల ఆవలో విహరిస్తున్న పర్యాటకులు

- సుందర సాగరతీరం
- ప్రకృతి అందాల ఆవ... సినిమా షూటింగ్‌లకు ప్రసిద్ధం
- ఏటికొప్పాక లక్కబొమ్మకు అంతర్జాతీయ ఖ్యాతి
- నేవల్ బేస్ ఏర్పాటుతో జాతీయస్థాయిలో ప్రాముఖ్యత
- పరిశ్రమలకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయంగా యలమంచిలి నియోజకవర్గం



అచ్యుతాపురం : ఈ నియోజక వర్గం యలమంచిలి , రాంబిల్లి , మునగపాక ,అచ్యుతాపురం మండలాల పరిధిలో ఉంది. ఒక మున్సిపాలిటీ కూడా దీనిలో అంతర్భాగంగా ఉంది. యలమంచిలి నియోజక వర్గం 1952లో ఏర్పడింది. సముద్ర తీరాన ఉండే అచ్యుతాపురం, రాంబిల్లి, ఎస్.రాయవరంతో పాటు, యలమంచిలి మండలాలతో ఏర్పడింది. తర్వాత ఎస్.రాయవరం మండలం పాయకరావుపేటలో విలీనం అవ్వడంతో మునగపాక మండలం యలమంచిలి నియోజకవర్గంలోకి విలీనం అయ్యింది.మొట్టమొదటి ఎమ్మెల్యేగా కృషికార్ లోక్‌పార్టీ తరపున పప్పల బాపునాయుడు గెలిచారు. మొత్తం 15 పర్యాయాలు ఈ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికలు జరగగా, ఆరుసార్లు టీడీపీ, నాలుగుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైఎస్సార్‌సీపీ, ఒకసారి కృషికార్ లోక్‌పార్టీ, మూడుసార్లు ఇండిపెండెంట్లు గెలిచారు. ఈ నియోజక వర్గం తరపున నాలుగుసార్లు టీడీపీ తరపున పప్పల చలపతిరావు గెలవగా, ప్రస్తుత ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబు) మూడుసార్లు గెలిచారు. నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం అధికంగా ఉంది. రెండో స్థానం గవర సామాజిక వర్గం, తదుపరి వెలమ సామాజిక వర్గం ఉంటుంది. మత్స్యకార్ల ఓట్లు, యాదవ సామాజిక వర్గ ఓట్లు, ఎస్సీ సామాజిక వర్గ ఓట్లు కీలకం. మైనారిటీ ఓట్లు ఉన్నప్పటికీ క్షత్రియ వర్గానికి చెందిన వారు ఆరుసార్లు విజయం సాధించడం గమనార్హం. కొందరు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలోకి రావడంతో పోటీ అధికార పార్టీకి, టీడీపీ మధ్య తీవ్రత నెలకొంది. చింతలపాటి సూర్యనారాయణ రాజు, వీసం సన్యాసినాయుడు, నగిరెడ్డి సత్యనారాయణ, కేకేవీఎస్ రాజు, పంచకర్ల రమేష్ బాబు కూడా ఈ నియోజకవర్గం తరపున ఎమ్మెల్యేలుగా ప్రాతినిథ్యం వహించిన వారే. ఈ నియోజకవర్గం తరపున మంత్రిగా పనిచేసే అవకాశం వీసం సన్యాసినాయుడుకి దక్కింది.

సామాజిక వర్గాల ప్రభావం

యలమంచిలి నియోజక వర్గం ప్రధానంగా ప్రభావితం చేసే కులాలు కాపు, వెలమ, గవర, క్షత్రియులు. అధిక శాతం ఉన్న కాపు సామాజిక వర్గం, వెలమ సామాజిక వర్గాలు బలపరిచే అభ్యర్థులకే గెలుపు అవకాశాలు ఉంటాయి. సహజంగానే ఇక్కడ కాపు సామాజిక వర్గానికి, వెలమ సామాజిక వర్గానికి పోటీ ఉంటుంది. యలమంచిలి, మునగపాక మండలాల్లో అధికంగా ఉండే గవర సామాజిక వర్గ నేతల ఓట్లు కూడా కీలకమే. మరో వైపు మత్స్యకార గ్రామాలైన పూడిమడక, తంతడి ఓట్లు సైతం గెలుపోటములను నిర్ణయిస్తుంటాయి.

బలంగా అధికార పార్టీ...

గత ఎన్నికల్లో యలమంచిలి ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ తరపున యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) తన సమీప టీడీపీ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుపై 4146 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రస్తుతం నియోజక వర్గంలో అధికార వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. గత ఎన్నికల్లో ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరారు. మళ్లీ పార్టీ మారి ఇప్పుడు జనసేనలో ఉన్నారు. ఈయన నియోజక వర్గ పార్టీ కార్యకలాపాల నుంచి దూరంగా వెళ్లి విశాఖ సిటీలో స్థిరపడ్డారు. కాపు సామాజికవర్గ నేత సుందరపు విజయ్ కుమార్ ప్రస్తుతం జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ పరంగా ఎమ్మెల్యే కన్నబాబు రాజు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, తులసీరావు కుమారుడు డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, విశాఖ వెస్ట్ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గానూ వ్యవహరిస్తున్నారు. మునగపాక మండలానికి చెందిన బొడ్డేడ ప్రసాద్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షునిగా వ్యవహరించడంతో నియోజకవర్గంలో అధికార పార్టీ బలంగా ఉంది.


యు.వి.రమణమూర్తిరాజు (వైఎస్సార్‌సీపీ)


సుందరాపు విజయ్‌కుమార్ (జనసేన)

రాజకీయాలకు అతీతంగా విరివిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు మౌలిక వసతులు అభివృద్ధి చేయడంతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు.

నియోజకవర్గం ప్రత్యేకతలు


పంచదార్ల ఉమా ధర్మ లింగేశ్వర ఆలయం

- సముద్ర తీర ప్రాంతానికి ఆనుకొని యలమంచిలి నియోజకవర్గం సెజ్ ప్రాంతంగా గుర్తించారు.
- పూడిమడక, తంతడి తీర ప్రాంతాలు సుందర దృశ్యాలతో కనిపిస్తాయి.
- తంతడిలో తరచూ సినిమా షూటింగ్‌లు జరుపుతున్నారు.
- అచ్యుతాపురం సెజ్‌లో అంతర్జాతీయ బ్రాండెడ్ కంపెనీలు ఉన్నాయి.
- కొండకర్ల–వాడ్రాపల్లి ఆవ ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతోంది.
- రాంబిల్లిలో పంచదార్ల పుణ్యక్షేత్రంలో భాగంగా నీటి జలధార నిరంతరం పారుతుంది.
- రాంబిల్లి మండలంలోని ఫణిగిరి కొండపై బౌద్ధ క్షేత్రానికి విశిష్టత ఉంది.
- యలమంచిలి మండలంలోని ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీకి అంతర్జాతీయ స్థాయిలోనే గుర్తింపు ఉంది.
- వాడ్రాపల్లి దక్షిణ కాశీశ్వర ఆలయానికి ప్రత్యేక ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు ఉంది.
- రాంబిల్లి మండలంలోని నేవల్ బేస్‌కు జాతీయ స్థాయిలోనే ప్రత్యేకత ఉంది.